


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

## (గత సంచిక తరువాయి)

"**ఇల్లు** కనుక్కో లేని బాలుడా? కాగితాలు వెదికివ్వాల్సింది నీ భార్య కదా?"

తండ్రిని ఏమీ అనే వీలు లేక ఊరుకున్నాడు. ఆయన పోయేదాకా ఇలాంటివి భరించక తప్పదు. ఆయనెప్పుడు పోతాడో ఆయనకే తెలియదు.

గుర్తులు చెప్పి అనంతాన్ని పంపారు. ఇంటికి ఫోను చేసి విషయాలు విశదీకరించాడు సింహాద్రి. అవెక్కడ పెట్టింది సింహాద్రికే గుర్తుకు రాలేదు. నిజానికి ఆమె సొంత ఆస్తితోనే ఆ స్థలం కొనింది. అది ఆమె పేరుతోనే ఉంది. ఆమె పేర ఉన్న ఆస్తులు అతన్ని జంతువులా ఆమెకు కట్టిపడేశాయి.

ద్విచక్ర వాహనాన్ని గేటుకు అడ్డుగా లేకుండా జాగ్రత్తపడుతూ అదీ వినయం చూపిస్తున్నట్టు పార్క్ చేశాడు.

ఇంటి ముందు పూదోట. పూలకూ తుమ్మెదలకూ లోటు లేదు. పక్షులూ, కాకులూ అరుస్తున్నాయి. ఎండగా ఉంది. సిమెంటుచప్టా మీదినుంచి నడిచి సింహద్వారం దగ్గిర ఆగాడు. మొక్కల్లో పిల్లి ఆడుకుంటోంది; ఎలకతోనేమో. పిలవాలా, ఐతే ఏమని? బెల్లు కొట్టవచ్చో లేదో; చెప్పడానికి ఎవరూ లేరే అని నవ్వుకున్నాడు. ఈ మధ్య నవ్వడం మరిచి పోయాడు.

లోపలనించి నాజూకైన స్వరం కవ్వింపుగా వినబడుతోంది; కృతయుగపు చలన చిత్ర శృంగార గీతం.

"అందముగా అలంకరిస్తా పోయిరావే ప్రియుని కొరకై; పోయిరావే తారా...ఈ నగవూ ఈ సొగసూ తగునటే సఖీ మనకూ, బంగారమునకు తావి వలెనె వెలయునే నీకీ సొగసూ, మోము చూసి మోహన నదిలో మునగని వాడేవాడే? నీ మనోరథం ఈడేరు నిపుడే."

స్వరం నుంచి మకరందం జాలువారుతున్నది మత్తుగా. ఆ పాట ఉన్నట్టుండి ఆగిపోయింది.

"లోపలికిరా, అనంతం, తలుపు తోసుకుని. తీసే ఉందది."

కొంచంగా తెరిచి ఉన్న సందు లోనుంచే, తలుపు ముట్టుకోకుండా లోపలికి దూరాడు. మిరుమిట్లకు కళ్ళు రెండు క్షణాలు మూతలు పడ్డాయి. పరిమళ భరితంగా ఉంది హాలు. అది మయసభలా ఉంది; ఇంద్రసభలా కూడా ఉంది. సతీదేవి మాత్రమే ఉంది. ఆమె ఊయల ఊగుతోంది కూని రాగం తీస్తూ. ఆమె తలనిండా మల్లెపూలున్నాయి, రేపనేది లేనట్లు. ప్రపంచంలోని ఏ దిగులూ తనకు లేదు అన్నట్టుంది. ప్రతి దిగులూ గోచరించాలని లేదు. కొన్ని ముంగురులు స్వేచ్ఛగా మొహాన్ని ముసురుతున్నాయి. కుడి వైపున్న తెరిచిన కిటికీలోనుంచి మచ్చ లేని తెల్లని పావురం ఏదో సందేశం పట్టుకొచ్చినట్టు లోపలికిదూరి సోఫా మీద వాలింది.

"ఎంతటి తెంపరివే," అనింది పావురాన్ని చూస్తూ, నాటకీయంగా.

"నిలుచుండి పోయావేమి? కూర్చో! పావురం గురించీ వచ్చావా?"

"దస్తావేజుల గురించండీ."

"బహుదూరపు బాటసారీ, ఏమి పుచ్చుకుంటావు – మంచినీళ్లా, శీతల పానీయమా, ఇంకేమన్నానా?"

అనంతానికి ఆమె వైఖరి నాటకీయంగానే కాక, కృతకంగా, వింతగా కూడా ఉంది. తాను కత్తిమీది సాము చెయ్యవలసిన అవసరం ఉన్నట్టుందిక్కడ. ఆమె ఊయలలో ఊగీ ఊగినట్టు ఊగుతోంది. ఆమె తల్లి ఊయలలో ఊపిన ఊపు చాలలేదేమో. ఫాను తిరుగుతున్నా ఆమె ముక్కు పక్క ముత్యాలలా చమట బిందువులు చేరాయి. అవీ ఆభరణంలా ఉన్నాయి. తాను దుకాణంలో చూసిన స్త్రీమూర్తికి ఈమెకూ ఇంత తేడా ఉందే! ఎందుకని? ఆమెకు బహుముఖాలేగాక, బహు స్వభావాలు ఉన్నాయా? ఆమెకు నాటకమే జీవితమా?

"అలాగా, అబ్బాయి? సింహాద్రి గారు దస్తావేజుల గురించి నిన్ను పంపారా? పావురం గురించి సారంగధరుడిలా వచ్చావనుకుని పొరబాటుపడ్డా. కానీ నేను ఇస్తేనేగా ఇక్కడినుంచి నీకు కదిలే వీలుంది. ఇవ్వక పోయినా వెళ్లి నేను ఇవ్వలేదని సింహాద్రి గారికి కావలిస్తే చెప్పవొచ్చు. అవి ఆయన ఎక్కడ దాచాడో ఆయనకే గుర్తులేదు; నేను శోధనా క్రియ ఆరంభించాలి. ఇల్లంతా దస్తావేజులు. కాబట్టి కాస్త ఓపిక తెచ్చుకో. నాకు తెలివయినవాళ్ల సాంగత్యం ఇంతవరకు దొరకలేదు; అంచేతా నా మేధ తన ఊసులు పంచటడానికి మరో మేధకై అర్రులుచాస్తోంది. ముందు నీ మేధా శక్తిని కాస్త నేను అంచనా వేసే ప్రయత్నమూ చేసుకోవాలి."

అది ఇంద్ర సభాకాదు, మయ సభా కాదు, పులి గుహ అని అతనికి అనిపించింది. ఆమె అనేక వేషాలతో పాటు పిల్లి వేషం కూడా వేయగలదని ప్రస్తుతం ఎలుకను పట్టుకున్న మార్జాల వేషం వేసిందని అతనికి అనిపించింది. బహుముఖ ప్రజ్ఞాశాలి. పిల్లి తనను తిని త్రేన్చుతుందా ఆఖర్లో?

ఆమె అన్నమాటలకు సమాధానం ఇవ్వకపోతే ఏమంటుందో అని అవునన్నట్టు కాక, కాదన్నట్టు కాక తల ఆడించి, తోకలేకపోవడం వలన అది ఆడించలేక పోయాడు. తన పరిస్థితికి తానే ఒక వెర్రి నవ్వు నవ్వాడు.

"నువ్వు ఇంతకన్నా బాగా నవ్వగలవాని నా అనుమానం."

ఆపుకో లేక పెద్దగా నవ్వాడు; ఆ నవ్వు చూసి ఆమె నవ్వింది. ఆమె నవ్వు కదు సుందరంగా ఉండటం అతను గమనించి సిగ్గుపడ్డాడు.

"సిగ్గు మగ వాళ్లకు కూడా సందర్భానుసారంగా సింగారమే."

"మీలా సౌందార్యాన్ని కనుగొనగల, దాన్ని అనుభవించగల నేత్రాలు కావు నావి."

"సరే, మనకు అట్టే సమయం సింహాద్రి గారు ఇవ్వరు, నిప్పుల కుంపటి మీద కూర్చునుంటారు; కనుక కొన్ని ముచ్చటైన ముచ్చట్లు ఆడుకుందాం, తుచ్ఛమైన ఆస్తి కాగితాల గురించి వీలైనంత వరకు మరచి. శూ ర్పణఖ లాంటి అందగత్తె నిన్ను తనతో కూడమంటుందనుకో, నీవు కాదంటే నిన్ను చంపుతానని కాక, అక్కడే ఉన్న కత్తితో తన ముక్కు, చెవులు కోసుకుంటా నని బెదిరిస్తుందనుకో– నీ స్పందనేమిటి? మన శూర్పణఖ మంచిది, అందగత్తె, వయసులో ఉంది; మన్మథుడికే మరులు పుట్టించేలా ఉంది; ఇంతవరకూ చెడని కన్నెత్వం గలది నీ గురించే దాన్ని దాచివుంచినట్టు. నీవూ మన్మథుడిలాంటి వాడవు. రాముడికన్నా మన్మథుడు అందగాడేమో నాకు తెలియదు. స్త్రీ పురుషులు కలియడం కామ యజ్ఞం లాంటిది; హవిస్సూ పుడుతుంది. మన్మథుడు, రతీ లాంటి అందమైన జంట కలయిక గురించీ చెప్పేదేముందీ? అందాలు అనుభవించాలని ఉన్నాయా, చూసి మైమరచి ఒదిలెయ్యడానికున్నాయా? నీకన్నాపెద్దదాన్ని; అన్నింటిలో, అన్నింటిలో అన్న మాటను నొక్కి పలికా, అనుభవజ్ఞురాలిని. కానీ, అనుభవాలూ అన్ని సందేహాలనూ అన్ని విషయాలలోనూ తీర్చలేవు. నిన్ను గురువుగా భావించి అడుగుతున్నా అనుకో; పాదాభివందనం చెయ్యడానికి, గురు దక్షిణ నాకు తోచినది ఇవ్వడానికి వెనుకాడను. నీవు అనుభవ శూన్యుడివి కావచ్చు. అనుభవించక పోయినా నీ ఊహకు అందే విషయమే ఇది అని భావించి సమాధానాన్ని అర్థిస్తున్నా. నుడువు."

"అందం తనను అనుభవించమని రెచ్చగొడుతుందేమో కూడా. చూస్తే కలిగే ఆనందంకన్నా ఎక్కువ శారీరక, మానసిక ఆనందాలను అనుభవం ఇస్తుందేమో. అనుభవం ద్వారా అందాన్ని లొంగుబాటు చేసుకున్నామన్న అహం సంతృప్తీ ఉండొచ్చు."

"ఆమె నిన్నడిగిన విషయం గురించి కూడా చెప్పు; నీవైతే ఏంచేస్తావు?"

"మీది ప్రశ్న కాదు; నేను చదవని విషయం మీద, నాకు తెలియని విషయం మీద పెడుతున్న పరీక్ష."

"నీవు రాయవలసినంత రాయకపోయినా ఉత్తీర్ణుడిని చేస్తాలే; వడ్డించే మనిషి నీ మనిషి. నీవు నిజంగా ఆమె ముందు లేవు కదా. భయపడకు; సరదాగా చెప్పు; పోనీ నేను ఆనందించడానికి చెప్పు. నీ బ్రహ్మచర్యం భంగపడుతుందని నిరాకరించావనుకో ఆమె చేత ఆమెను ఆమె కోరిన కోర్కె అనే పాపానికి శిక్షించినవాడి వవుతావు; నీ అందానికి ఆమెను బలి తీసుకున్న పాపాత్ముడివి అవుతావు. నీవు సున్నిత మనస్కుడివైతే ఆ హింస నిన్ను జీవితాంతం వేటాడి బాధిస్తుంది.

ఆమెకు నీవు సహాయం చేసినట్టూ కాదు నువ్వు ఒప్పుకుంటే. నీవు ఆమెకిచ్చే సుఖానికి ఆమె నీకు అదే సుఖాని ప్రతిఫలంగా ఇస్తుంది నిజానికి."

"కామం తలకెక్కిన రెండు పశువుల విషయమన్నట్లు మాట్లాడుతున్నారు. ఒక పశువు కోరినంత మాత్రాన మరో పశువు మొరాయించకుండా లొంగిపోవాలా, లొంగిపోతుందా? మనకు కొన్ని విలువలుంటాయి; ప్రశ్నించి బాధించే మనసుంటుంది, చూట్టూ గమనించే ప్రపంచముంటుంది, అందం మీద ఆధారపడని ఇష్టం, అనిష్టం అనేవి కూడా ఉంటాయి. ఇన్ని అడ్డంకులూ, అవాంతరాలనూ అధిగమించాలి. ఒక అనుభవంతో మనసు తీరే అందం ఏపాటిది? అందమే కలయికకు చాలు అనుకుంటే, ఆమెకు నాకన్నా మరింత అందగాడు తారస పడితే నన్నొదిలి పోతుందా? అంతెక్కడ? ఆ కొత్త మనిషి దగ్గరకూ వెళ్లి తల నరుక్కుంటా అంటుందా?"

"నీ తార్కిక ఆలోచనలు, మాటలూ కాదు ఆమెకు కావలసింది; మానసిక, శారీరక సుఖం; అది తీరకుంటే ఆమెకు ఆమె ప్రాణం తృణప్రాయం. ఆమె తన ప్రతి అంగాన్ని వైకల్యం చేసుకుంటుండగా చూసి భరించగలవా నీ తర్కాన్ని కవచంగా చేసుకుని?"

"నిజ జీవితంలో అలాంటి సంక్లిష్ట పరిస్థితి ఎదురవుతుందని నేను భావించడం లేదు. ఊహాజనితమైన అంశాలకు సమాధానాలు దొరకవు, కనీసం సరైనవి. ఒక వేళ ఎదురైతే ఆ క్షణానికి నా మనసు ఏమి నిర్ణయిస్తే అది చేస్తాను. మనసూ "నేను" ఒకటి కాదు. వేదాంత చర్చలోకి పోదలచుకో లేదు. ప్రస్తుతం నా మనసుకే తెలియని విషయాన్ని నేనెలా చెప్పగలను?"

ఆమె వ్యంగ్యంగా చప్పట్లు కొట్టింది. నాట్య విలాసంలా ఉందది. వాటికి ఆమె గాజులు వంత పాడాయి. ఆ విలాసం, చప్పుడులూ, విశృంఖలంగా ఉన్న మల్లెల వాసన వాటికి పురుషుడిని బానిసను చేయగలవు. అది మైమరపించే గానగంధర్వము.

అపశ్రుతి. ఫోనొచ్చింది.

"వెదుకుతున్నా," అని మరో మాట మాట్లాడనీయకుండా స్విచ్ ఆఫ్ చేసింది.

ఆమె ఫోన్ పెట్టేసి, అనంతం దగ్గిరికి వచ్చి అతను కూర్చున్న పెద్ద సోఫాలో ఒక చివర కూర్చుంది. అతను లేవబొతే నివారించింది.

"మనసూ శరీరం అందానికి, పశువాంఛకు ఊడిగం చేస్తుంటే ఎంతవరకని నివారించడం? మనసూ శరీరం 'నేను' కాదు అని నమ్మడం తదనుగుణంగా ఆలోచించడం ఆచరణీయమా? కోర్కెకు బానిసలం, కోర్కెకూ అందానికీ చెలిమి. చింతామణిని బిల్వమంగళుడు మరిగాడు. ఆమె శరీరం, ఆమె మనసు, ఆమె కళాత్మకత, ఆమె కోర్కె అతనికి సర్వస్వము ఈ లోకంలో. సౌందర్యవతి తన సౌందర్యాన్ని చూసుకుని మురిసి పోవచ్చు; కానీ పరోక్షంగా మరొక వ్యక్తిపై దాని ప్రభావం గురించి ఆలోచిస్తుందా? తండ్రి ఆబ్దికం ఆలా పెట్టాడో లేదో బోరుమని కురిసే వానలో, వరదై పారుతున్న

నదిలోకి దూకి ఒక తెప్పలా కనిపించిన దాన్ని ఎక్కాడు; అదొక శవం. దాని సాయంతో అవతలి ఒడ్డుకు చేరాడు. ఆమె ఇల్లు కిందంతా మునిగింది. ఒక తాడులాంటిది పట్టుకుని మేడనుచేరాడు. అది తాడు కాదు, పాము. చింతామణి అందం అతనిలో రగిలించింది ఉన్మాదం, కోర్కెకు పెద్దక్క. ఆమె అదంతా చూసి సన్యసించింది తన అందం మీద తిరుగుబాటుగా. ప్రతి అందమైన వ్యక్తితో కామకేళి జరుపుతామని కాదు. అరుదైన అందం సంగతి మాట్లాడుతున్నా. ఈ విషయంలో స్త్రీ పురుషులకు తేడా ఉంది; ఆమె నిగ్రహం చూపించగలదు. ఆమెకూ ఎప్పుడన్నా, అరుదుగానైనా అందాన్ని లైంగిక సుఖంతో ముడిపెట్టాలని అనిపించవచ్చు. దానికి వీలు లేకపోవడం వేరే విషయము. పురుషుడిలో విశృంఖలత ఉంటుంది. శూర్పణఖకు అడ్డంకులు లేవు. కేవలం నీ నిర్ణయం మీద ఆమె అభీష్టం నెరవేరుతుందా లేదా అన్నది ఆధారపడుంది. మనం సగం వాస్తవ జీవులం, సగం ఊహాజీవులం. ఊహాజనితం అని కొట్టిపారేయకు."

అతను తల పక్కకు తిప్పి చూసాడు. ఇప్పుడు ఆమె మరో ముఖం కనిపిస్తోంది ఆమె ముఖం తీవ్రంగా ఉంది, భయం కలిగించేలా కూడా ఉంది. ఆమెలోని బడబాగ్ని స్వరూప స్వభావాలేమిటి?

"చెప్పయ్యా సరైన సమాధానం."

"మీకు ఏ సమాధానం నచ్చుతుందో చెప్పండి, మేడం"

"నాకు నచ్చడం కాదు, నువ్వు ఏమి చేస్తావో అది కావాలి; నాకు నచ్చకపోయినా సరే."

"మీరు నన్ను ఏమి అన్నా నేను కోపగించె వీలు, అర్హత లేవు కదా," బేలగా అన్నాడు.

"ఇందు మూలంగా హామీ ఇస్తున్నా, నన్ను అనడానికి నాకు ఏదన్నా చెయ్యడానికీ నీకు పూర్తి స్వాతంత్రం ఉంది."

తన పిరికిదానాన్ని కుబుసంలా విడిచాడు; మానసిక బానిసత్వంకన్నా మరణం మేలు అనిపించింది. ఏమి చేయగలదు ఆమె? కాకపోతే కొడుతుంది లేక తిడుతుంది; కాదూ ఉద్యోగం నుంచి పీకేయిస్తుంది.

"మీది తలా తోకా లేని ప్రశ్న. దానికి తలా తోకా లేని సమాధానం ఇవ్వాలి. అది నాకు చేతగాదు. ఒక విషయం మాత్రం నిజం: మీరు మీ తెలివితేటలను ఉపయోగించి నాతొ చెలగాటమాడుతున్నారు."

"తలా తోకా లేని ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వలేని నీవు నా తెలివితేటల గురించి మాట్లాడుతున్నావు. నా దగ్గిర తెలివితేటలేనా, అందంకూడా ఉందంటావా? నీవు మూషికమూ కాదు, నేను మార్జాలమూ కాదు. నేను చెలగాటం ఆడుతున్నట్టు భావిస్తే నన్ను అవమానిస్తున్నట్టు భావించాలి నేను. అలా భావించించినా ప్రతీకార చర్య ఉండదు నేనిచ్చిన హామీ దృష్ట్యా. "

"మీ అందం గురించి మాట్లాడటం సంస్కారయుతం కాదు నాకు చెందినంత వరకు. వయసులో కూడా పెద్దవారు; వివాహిత. మీకున్నంత తెలివి ఉండుంటే మీ ప్రశ్నకు సరైన సమాధానం ఇచ్చేవాడిని. పైగా అంత చనువూ నేను తీసుకోలేను."

“నా అందం గురించి నాతో మాట్లాడేంత చనువు తీసుకోవచ్చు. దానికి నీవు చెప్పినవాటిలో ఏదీ పెద్ద కారణం కాదు. "

"మీరు అనుమతి ఇచ్చినా తీసుకోను; ఈ హక్కు నాకుంది."

"పోనీ నా అందం గురించి కాక అందం గురించీ మూడు ముక్కలు మాట్లాడు."

"ఏ వ్యక్తి రూపాము లోనూ ఎంతోకొంత మేరకు వైవిధ్యముంటుంది. రూపం అనగానే ముఖానికి వర్తింపచేస్తాం. చిత్రపటం లోనూ మనం చూసే ముఖ్య అంశం అదే; మిగతా శరీరం తదుపరిది. చిత్రపటంలోలా ఒకే ముఖ కవళికలతో ఉండి పోదు మనిషి. అవి అందాన్ని ఇనుమడింప చెయ్యవచ్చు తగ్గించనూ వచ్చు. భావాలకు అనుగుణంగా ముఖ కవళికలు మారతాయి. చర్మం అనే పలుచటి పొరకేగా అందంవర్తిస్తుంది? కాలం, రోగం, మానసిక బాధ, గాయాలకు అందం లోకువ."

అనంతానికి స్వభావం గురించీ ఫ్రాయిడ్ చెప్పిన విషయాలు గుర్తుకొచ్చాయి. స్వభావం గురించి మరోలా చెప్పుకో వచ్చు. స్వభావానికి వైవిధ్యం లేక చంచలత్వం ఉంది. సందర్భానుసారం సాంఘిక మర్యాదా లేక భయం అనే పంజరం పరిధిలో అది మెసులుతుంటుంది అసహనంగా. వీలు చిక్కినప్పుడల్లా ఆ పక్షి బైట విహరించి గూడు లేక పంజరం చేరుతుంటుంది. అంటే స్వేచ్ఛ కాస్తో కూస్తో లేక ఎక్కువగా కూడానూ ఉంటుంది. ఇపుడు అంత వీలు, స్వేచ్ఛ కలిగిందని ఆమె ఏ కారణంగా అనుకుంటోందో అనంతానికి అర్థం కాలేదు. తనను ఈ విధంగా హింసించడం ద్వారా ఆనందిస్తోందా? తను ఇంతటి అందానికి అనర్హుడిని అని భావిస్తోందా, లేక దాన్ని ఆమె పొంద లేక పోతున్నందుకు నిస్పృహా?

"ఈ విధంగా అను: ‘ఇష్టం లేనట్టుగా నాకు నేను సమాధానపడుతూ ఆ అద్వితీయమైన స్త్రీని అనుభవించి మేము ఇద్దరం ఆనందిస్తాము, ఆమె తనకు తలపెట్టుకున్న హానిని నివారించడం ద్వారా ఆ అపరాధభావం జీవితాంతం నీడలా వెన్నంటే ప్రమాదం నుంచి తప్పించుకుంటాను.’ చెప్పు – కనీసం నా గురించి; మీ ఇద్దరి ఆనందం నాదన్నట్టు తృప్తి పడతాను. నాది వోయరిజం. ఒక అబద్ధం నన్ను ఆనందింపచేసే సత్కార్యం గురించి ఆడలేవా, అనంతం?"

"సరే నేను ఆడినట్టుగా మీరు భావించండి."

"ఇక్కడా డొంక తిరుగుడా?"

"మాటలు వేరుగాని మీకు కొంతయినా ఊరట కలిగించే భావమేగా, అమ్మ గారూ?"

"నువ్వు నా నౌకరువి కాదు; కాక పొతే మా ఆయనకు."

"బానిస భయం అసంకల్పితంగా నా చేత ఆ సంబోధన చేయించుండవచ్చు. మీ నౌకరును కాకపోయినా మీ పట్ల అధిక విధేయత ప్రదర్శించటం నేరం కాబోదమ్మ గారు."

"ఆ మాటల్లో నిజాయతీ లుప్తమయిందేమో అని నా అనుమానం. నన్ను 'అమ్మ గారు' అనడం లో నాకు ఏదో సందేశం నిక్షిప్తమై ఉండొచ్చునేమో."

"నాలో ఇంకా లోతుగా ఆలోచించగలిగిన సామర్థ్యం వేళ్ళు తన్నలేదు. ఆ సందేశం ఏమయి ఉంటుందో విస్పష్టం చేస్తే, సంజాయిషీ ఇచ్చుకోడానికి నేను సంసిద్ధం."

"నీకు తెలిసే ఉంటుందని నాలో ఏ మాత్రం అనుమానం కలిగినా, చెప్పడం వృథా అని నేను భావిస్తున్నా. కొన్ని భావాలు సిగ్గు విడిచి చెప్పగల పరిపక్వత నాకు రాలేదు. సిగ్గు విడవగలగటం పరిపక్వత అని అనుకుంటే. సిగ్గు విడవటాన్ని బరితెగించడం అని సాధారణ భావన."

ఆమె వెళ్లి ఏదో పానీయం తెచ్చి ఇచ్చింది. వెంటనే ఫోను మోగింది.

"వెదుకుతున్నా; దొందరపడితే ఎలా. మరో పావుగంట ఓపికపట్టండి, దయచేసి."

అతను ఆ నీటి లాంటి ద్రవంలో తన ప్రతిబింబం చూసుకుంటున్నాడు, ఆమె ఫోనులో మాట్లాడుతుంటే.

"బాగుందా?"

"ఇంకా తాగడం మొదలుపెట్టలేదండీ."

"నేనడిగేది నీ ప్రతిబింబాన్ని."

"నేను బాగుంటే నా ప్రతిబింబం బాగుంటుంది. నేను అందులోకి చూడటమంటే నేనెలా ఉన్నానో నేను చూసుకున్నట్టవుంటుంది; తెలివైన పని కాదేమో."

"నాకు నువ్వెలా కనిపిస్తున్నావా అన్న కుతూహలాన్ని అందులో చూసుకుని తీర్చుకోడం కావచ్చు. నాకు నీవు ఎలా కనపడితే నేమి?"

"నిజంగానే నా ఉద్దేశం అదే అయినా, అర్థ రహిత కుతూహలంగా, ప్రయోజన రహిత కుతూహలంగా భావించండి.పైగా మిమ్మల్ని ఉద్దేశించిన చర్యగా కాక నా ఆనందానికి నా ప్రతిబింబాన్ని చూసుకున్నానని కూడా మీరు భావించ వచ్చు."

"అలా అని నీ చర్యకు విశ్వసనీయతను తెచ్చుకునే ప్రయత్నం చేసుకో వచ్చు. ఆ విషయం వదిలేస్తే – ప్రతి ఒక్కడిలో నార్సిస్సస్ కొలువుంటాడు. ఒవిడ్ ఆ కథను కవితాత్మకంగా చెప్పాడు."

"ఆ కథ నుంచి ఎన్నో విషయాలు తెలుసుకో వచ్చు.

"మచ్చుకు ఒకటి చెప్పు."

"ఉన్మాద స్థాయిలో ఎవడిని వాడు ప్రేమించుకో కూడదని, అలా చేస్తే ఏకాకిగా ప్రపంచంలో జీవించ వలసి రావచ్చని."

"అందం ఉన్నవాడికేగా ఆ కష్టాలు?" ఆమె అంది.

"వాడికే కాదు వాడి వలన లేక ఆ స్త్రీ వలనా ఇతరులకూ ఎంతో ఇబ్బంది."

"మా ఆయనను దృష్టిలో పెట్టుకుని అంటున్నావా?" కోపం నటిస్తూ అన్నది.

"నిజంగా – మీ వారి సంగతి మీకే తెలియాలి; నాకు ఇంతవరకూ తెలీదు."

"స్త్రీ ఉసురు కూడా పోసుకున్నాడు నార్సిసిస్. కౌగలించుకో బోయిన ఇకో (ప్రతిధ్వనిని) దగ్గిరకు రానీయక పోవడంతో కృశించి నశించింది."

"అంత మంది వెనకబడుతున్నపుడు ఎంత మందినని తనను అనుభవించనీయ గలడో?" అతను అన్నాడు.

"ఏ ఒక్కరినీ అనుభవించ నీయక, అందాన్ని పంచుకోకా తానె దాన్ని అనుభవించాలనుకోడమే కదా నేరం?" ఆమె అనింది.

"నిజానికి అతను ప్రేమలో పడింది తన ప్రతిబింబంతో; అందులో తన అందాన్ని చూసుకున్నాడు."

"ఆ ప్రతిబింబాన్ని చూసుకోవడం మాత్రమే జరిగింది, తన అందాన్ని తాను అనుభవించడం జరగలేదు. చూసుకోడం కూడా అనుభవంతో సమానమే."

అతను నవ్వాడు.

"అనంతం ఎందుకు నవ్వాడు?"

"మీరు ఇందాక చెప్పినామె నా అందాన్ని చూడడమే అనుభవంగా అనుకుని ఉంటే, ఆమె పిలిచినా అది నాకు నాకు అగ్ని పరీక్ష అవదు; మీరు గుచ్చగుచ్చి ప్రశ్నలు వేయడమూ ఉండదు."

"నీవు అలా వస్తే నేను ఇలా వస్తా. నిజానికి కథకొనసాగింది. చూసుకోవడం ఒక రకం ఆనందం కావచ్చు. కానీ జరిగింది వేరుగా. ప్రతిబింబాన్ని చూసి చూసి దాన్ని వేరే విధంగా – శారీరకంగా అనుకుందాం – అనుభవించలేక పోవడం నిస్పృహకు దారి తీసింది. నశించి పూవైనాడు. ఇప్పుడు చెప్పు ఆమె కోర్కెకు నీవు లొంగుతావో లేదో. నిజానికి నీవు ఒక విషయం మరిచావు. ఆమెను చూసి ఆమెను అనుభవిద్దామన్న కోర్కె నీకు కలగదని ఎందుకనుకోవాలి?"

"సరే ఆమెకు ఏదో హాని జరుగుతుంది, దానికి నైతికంగా నాపై బాధ్యత పడుతుంది అని కాక మీరన్నట్టే భావిద్దాము. ఆమె అందం నన్నూ రెచ్చగొట్టి కోర్కెలోకి దింపినపుడు పేచీ ఏముంటుంది? ఆమెతో కలుస్తా."

"అసాధ్యమైన కోర్కె ప్రాణాంతకమనీ ఆ కథ హెచ్చరిస్తుంది," ఆమె అనింది.

"అందమూ అవాంఛనీయమేమో అది కోర్కెకూ తద్వారా అనుభవానికి దారితీస్తుంది కనుక."

"నా అందాన్ని నువ్వు, నీ అందాన్ని నేనూ నిర్మూలించి ఒకరికొకరం మేలు చేసుకుందాం అందం హానికరం కావున," వ్యంగ్యంగా అంది ఆమె.

"అందం లేకపోయినా లైంగిక బాధ, ఆవేదనా తప్పదు."

ఆమె ఏదో అందామనుకునే సరికి ఫోను మోగింది; ఆమె ముఖం వికృతంగా మారింది.

"కాగితాలు ఎక్కడో పూడ్చిపెట్టి నన్ను వేధిస్తే ఎలా? వచ్చి వెదుక్కో..అవి దొరక్కపోతే నేను అతనికి ఇవ్వలేను కదా, నేను ఇవ్వలేకపోతే అతను తీసుకు రాలేడు. ఉరుమురిమి మంగళం మీద పడ్డట్టు  అతన్ని తిడితే ఎలా? అతనొచ్చి ఇరవై నిముషాలయింది. కొన్ని కాగితాలు మిగిలాయి; వాటిల్లో ఉండొచ్చు. దొరికితే చెబుతాను; రాగలిగితే నువ్వే వచ్చి ఒక కప్పు కాఫీ తాగి వాటిని తీసుకు పోవచ్చు. అయిదు నిమిషాల్లో అవి దొరికినా దొరక్కపోయినా అనంతాన్నివెనక్కు పంపుతా, సరా?"

"అనంతం, నీకు ప్రమాదం పొంచి ఉంది," ఏ మాత్రం సానుభూతి లేకుండా అనింది.

అతను సోఫాలో నుంచి లేచిపోయాడు.

"భయంకరమైన అనుభవం జరగబోతోంది. దానికి అందంతో సంబంధం లేదు. మీ చలువే,"

"నీ అందాన్ని నిందించు ఈ విషయంలో."

"మొదటి రోజు మమ్మల్ని తప్పుగా అర్థంచేసుకున్నా."

"నీకు ఉపయోగపడే జీవితానుభవమే. నిజానికి ప్రతి అనుభవంనుంచి ఒక పాఠంనేర్చుకోవచ్చు. నిన్ను ఎక్కువ ఇబ్బంది పెట్ట దలచలేదు. లోపలికిరా నాతొ."

ఆమె వెనుక బలిపశువులా నడిచాడు; తెగించి. హాల్లో నుంచి కుడివైపున్న గదిలోకి ఆమె నడిచింది; ఆమెతో పాటూ ఆమె పరిమళం కూడా, హాల్లో ఉండిపోకుండా. ఆ గది కిటికీలన్నీ బిగించి ఉన్నాయి. వెలుతురూ అంతంతమాత్రంగా ఉంది.

"పావురాలు దూరుతాయని కిటికీలు మూసి ఉంచా. ముగ్గి చావాల్సొస్తోంది. ఇపుడు మచ్చ ఇంకా అంటని తెల్ల పావురాన్ని నేనే వెంటపెట్టుకు తెచ్చా. ఈ నాటి పావురం ఒకనాటి రాబందు కాగూడదని లేదు. కాలం మంత్రగత్తె."

ఆ మంచం మీద తెల్లటి పావురం లాంటి దుప్పటి పరచి ఉంది. ముగ్గురికి సరిపొయ్యేంత విశాలమైన మంచం. ఒక శృంగార చిత్రం ఒక గోడకు వ్రేలాడుతోంది నిస్సహాయంగా.

"ఇక్కడ ఏదన్నా అసాధారణ సంఘటన జరుగుతుందని అనుకుంటున్నావా?"

"అనుకోవడం లేదండి? మీరు నన్ను చంపుతారని అనుకోగలనా? ఇంటి కప్పు అనుకోకుండా విరిగి పడుతుందని అనుకోగలనా?"

"అమాయకత నటించకు?"

"నేను అమాయకుడినే అయినపుడు నటించడం ఎందుకూ?"

"నీలో అసాధారణమైన అందముంది, అది విధ్వంసకరమవుతుందేమో అనిపిస్తోంది హెలెన్ అఫ్ ట్రాయ్ అందం ఒక యుద్ధానికి దారితీసింది. ఎందరో యోధులు మరణించారు. గర్వించే ఉండొచ్చుగా తన అందం అంతమందిని బలికొనిందని, వెయ్యి నౌకలు తనను వెదుక్కుంటూ పయనమయ్యాయని?"

అతను సమాధానం ఇవ్వ దలచుకోలేదు. మరీ ఆలస్యం కాకపోతే ఉద్యోగం పోకుండా ఆగవచ్చన్న ఆశ చావకపోవడం వలన. ఆమె గొంతు కూర్చుంది. ఆమె శరీరం విప్పారింది; ఆమె విరిసిన పూవైంది. ఆతను దృష్టి మళ్లించి పైకప్పుకు చూపులు గుచ్చాడు. ఆమె లేచింది. కాగితాలు వెదికుతునట్టు నటిస్తోంది అని అతనికి అనిపించింది. బీరువాలో కాగితాలను తీసింది; దొరికాయి అనింది. అతను చేయి చాపాడు.

"ముహూర్తం రాలేదు," అనింది ఇవ్వకుండా.

అతను కృంగిపోయాడు. భర్తకు ఫోన్ చేసి ఏదో మాట్లాడింది మరో గదిలోకి వెళ్లి. ఏమ్మాట్లాడుతోందో! నిట్టూర్చాడు.

హాల్లోకి వచ్చారు.

"ప్రాణ సంకటంతో బాధపడుతున్నా."

"నేను చంపుతాననా?"

"ఉత్కంఠ ఒక పక్క, ఉద్యోగం పోతుందని ఆందోళన మరో వైపు."

"ఇది పొతే గోయెలికి చెప్పిమరొకటి వేయిస్తా."

గోయల్ అన్నతనితో మాట్లాడింది హిందీలో. గోయల్ చిరునామా ఇచ్చింది.

"ఇక నువ్వు వెళ్ళచ్చు; విలువైన కాగితాలు కదా, నీకివ్వను. వెళ్లి సింహాద్రి గారికి చెప్పు. ఇక ఎప్పుడూ నన్ను కలిసే ప్రయత్నం చేయకు. గోయెల్ నీకు ఉద్యోగం ఇస్తాడు నువ్వు వెళ్లి కలియడం జరిగితే. అది దొరికిందని నాకు చెప్పడానికి కూడా రానక్కరలేదు. నీవు నేను పెట్టిన పరీక్షలో గెలిచావు. మెచ్చి మరో ఉద్యోగం ఇప్పించదలిచా."

"మీరేమనుకోకపోతే, ఆ పరీక్ష ఏమిటో కూడా చెప్పగలరా?"

"మేధావివి, ఆలోచించు; అదొక అగ్నిపరీక్ష."

"ఆ అగ్నిపరీక్ష మీకు మంచి కాలక్షేపాన్నీ ఆనందాన్ని సమకూర్చింది."

## *2. అసత్యం వద*

బంగాళా చుట్టూ ఉన్న చెట్లలో ఏ చెట్టు మీదో దారి తప్పి ఒచ్చినట్టున్న కోయల అరుస్తోంది మిరప పండు తిన్నట్లు. గేటు దగ్గరి కాపలాదారు అయ్యగారు రమ్మన్నారు అన్నాడు; ఒదిలాడు లోపలికి. మనిషికి మనిషినుంచీ రక్షణ కావాలి; అడివిలో అయితే క్రూర మృగాలనుంచి. హరిశ్చంద్ర గోయల్ అతని భార్యా ఇద్దరు ముగ్గురు పనివాళ్ళూ ఉన్న ఆ బంగాళా బావురు మంటోంది. వరండాలో నలభై ఏళ్ళ ఆడ మనిషి పిలుపులకై ఎదురు చూస్తూ కూర్చుని ఉంది. అక్కడ గాలి రెక్కలు కట్టుకుని వీస్తోంది. రాబోతున్న వ్యక్తి గురించీ ముందే తెలిసి ఉండటవలన ఆ మనిషి అతన్ని తనతో రమ్మని

పద్మవ్యూహంలోకి తీసుకెళ్లింది. అటు తిప్పి ఇటు తిప్పి గోయల్ పడక గదిలోకి చేరారు. పదిమంది పడుకోడానికి సరిపొయ్యేలా ఉందది; మంచాలు మాత్రం రెండే ఉన్నాయి ఎదో అనుబంధం ఒక దాన్నిమరొక దానితో కలిపి ఉంచినట్టు. అక్కడ అమృతాంజనం వాసన వ్యాప్తి చెంది ఉంది. వచ్చిన యువకుడిని స్పష్టంగా చూడదలచి ముందున్న బల్లమీది కళ్లజోడును కళ్ళకు తగిలించుకుంది గోయల్ భార్య. అనంతాన్ని పుస్తకం చదువుతున్నట్టు చదవడం మొదలు పెట్టింది. ఆమె కన్నా గోయల్ ఆరోగ్యంగా ఉండటమేగాక అతనికి కళ్ళజోడు అవసరంకూడా ఉన్నట్టు అనిపించ లేదు. అంతటి బంగ్లాకు కాపలా కాస్తున్నట్టు కాస్త చికాకుతో కూడా ఉన్నాడు. అతనికి మనుషులతో వ్యవహరించడమంటే చాలా విసుగు. వానప్రస్థం వెళ్ళాలిసింది బంగళాలో బలవంతాన ఎవరో ఉంచేసినట్టు అతనికి రాత్రిపూట మెలకువ వచ్చినపుడు అనిపించి భార్యను లేపి ఒక క్షణం పలకరిద్దామా అని అనిపిస్తుంటుంది. మళ్ళీ ఆమెకు నిద్రపట్టదని ఆ పనికి పూనుకో కుండా ఉండటానికి ప్రయత్నిస్తుంటాడు. డెబ్బై అయిదు ఏళ్ల వయసు వచ్చింది కానీ, మరో పాతిక పూర్తి చేస్తే బాగుండు అనుకుంటాడు; ఒక వేళ భార్య తనను వదిలేసి పొతే మరో పాతికేళ్ళు గడపటం దుర్భరం అన్న ఆలోచనా ఉంది. గదికి మూల ఒక చెక్క కుర్చీ ఉంది. పడక కుర్చీలో బార్లా కాళ్ళు ఎడమ చేసుకుని కూర్చునున్న గోయల్ ఎడమ చేత్తో సైగ చేయగా దాని అర్థాన్ని గ్రహించిన అనంతం ఒద్దికగా కూర్చున్నాడు అతనిలాంటి పనికిమాలిన వాళ్ళ గురించీ ఉంచిన చెక్క కుర్చీలో; అమృతాంజనం వాసనను పీలుస్తూ. గోయల్ భార్య తనను కళ్లజోడులోనుంచి రెప్ప వేయకుండా గమనిస్తోందని గ్రహించడానికి కష్టపడలేదు.

గోయల్ భార్యకు అనేక జబ్బులున్నాయి; ఆస్తిలా వంశ పారంపర్యంగా వచ్చినవి కాక ఆమెకు ఆమెవంటూ కొన్ని. కొన్నింటిని వాళ్లకున్న డబ్బు ద్వారా నయం చేసుకోగా, వదలకుండా ఉన్న కొన్నింటి నుంచి డబ్బు సాయంతో ఉపశమనం పొందుతోంది. భర్తకూ జబ్బులున్నాయి; వాటికి బాగా అలవాటుపడి భార్యతో అంటుంటాడు – "రోగాలు లేక పొతే నాకు మరీ తోచదేమో, పద్మావతీ."

"నీ పేరేమిటన్నావ్?" అడిగాడాయన.

వినయంగా చెప్పాడు.

"నీ పేరునుంచీ నాకు ఒక అబద్ధం వినిపిస్తోంది; అల్లా అన్నానని ఏమీ అనుకోకు. ముసలితనం చాదస్తాన్ని తెచ్చి పెడుతుంది; ఆపలేము వయసులాగే చాదస్తాన్నీనూ. నేను నీ పేరు గురించీ అలా అనడానికి కారణం లేదు అనుకోకు. కారణం లేకుండా ఒక్క పదమూ నా నుంచి వెలువడదు. నా పేరులోనూ అబద్ధం ఉంది. నేను అబద్ధం ఆడనా?"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS